ఉపయోగపడుతుంది. అందువలన కొన్ని మంచి పనులు చెయ్యి అది దేవుని బ్యాంక్‌లో పడుతుంది. మన దేహప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు ఒకో మనిషికి ఒకోరకమైన పనిఇస్తాడు. ఆపనిని సక్రమంగా చెయ్యి. మీరు చేసే పని ప్రేమగా, ఇష్టంగా చెయ్యండి. మీ అత్తగారు మీ ఇంటి దగ్గర ఉన్నారు అనుకోండి. కొంత మంది విసుగుగా చూస్తారు. అలావద్దు మీకు చూడటం ఎలాగు తప్పదు. ఆచూసేది ప్రేమగా, ఇష్టంగా చూడండి. ఆపనిలో దేవుని చూడండి అలాచేస్తే పాతవాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు, రాబోయే జన్మకు హేతువులు ఏమైనా ఉంటే అవిపోతాయి. ఎలాగైనా పనిచేయటం నీకు తప్పదు చేసేపని విసుగుగా కాకుండా ఇష్టంగా, ప్రేమగాచేస్తే మీకు భగవదనుగ్రహం కలుగుతుంది.

## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 5-5-98)

### ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు దుఃఖంలో నుండి, భయంలో నుండి విడుదల పొందాలంటే ఆత్మానుభవం సంపాదించాలి. బ్రహ్మానుభవం పొందినవాడికి నేను, నాది అనేది అర్ధరహితములు. నేను అంటే అహంకారం అంటారు, నాది అంటే మమకారం అంటారు. ఇవి రెండూ చైతన్యంలో లేవు. ఇవి రెండు మనస్సులో ఉన్నాయి. ఇవి రెండూ నీ అశాంతికి కారణం. నీ మనస్సు అణిగితే ఇవి అన్నీ అణిగిపోతాయి. మనస్సును హృదయాకారం చెందింప చేయటానికి వైరాగ్యం, అభ్యాసం ఉండాలి. బలహీనులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు అని ఉపనిషత్‌లలో చెప్పారు. ఆత్మజ్ఞానం కలుగకపోతే వాడి స్వరూపం వాడికి తెలియదు. వాడి స్వరూపం వాడికి తెలియకుండా స్వరూపసుఖం వాడికి అందదు. ఆత్మజ్ఞానం లేకుండా ఏ మనిషి సుఖిఅవ్వలేడు. వైరాగ్యము, అభ్యాసము ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఆత్మజ్ఞానం సంపాదించటానికి రెండూ అవసరమే. ఈ జన్మలో అయినా, ముందు జన్మలో అయినా నీ మార్గం ఏదైనా గురువు ఎవరైనా చిత్తశుద్ధి అనేగేటు ద్వారానే నిర్వాణ స్థితిలోనికి ప్రవేశించగలము. లోపలఉన్నవస్తువు ఎంత పవిత్రమైనదో మన మనస్సు అంత పవిత్రమైనప్పడు మాత్రమే అది తదాకారం చెందుతుంది. మన మనస్సుకు పవిత్రత లేకపోతే అది అంతర్‌ముఖం కాదు. అంతర్‌ముఖం కాకపోతే దానికి అంతర్‌దృష్టి కలుగదు. మనస్సుకు అంతర్‌దృష్టి లేకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఒక్క ఆకర్షణకు లోబడిన నీవు పతనమవుతావు. ఆ ఆకర్షణలకు లోబడకుండా ఒక్క వైరాగ్యమే నిన్ను ఆపుచేస్తుంది. ఇంకో మార్గం లేదు. వైరాగ్యం ఉన్న మనిషికి మనస్సు బాహ్యాముఖంగా విజృంభించటం ఆగిపోతుంది. మనస్సు బాహ్యముఖానికి విజృంభించటం ఆగిపోయిన వెంటనే అది మూలతలంపు యొక్క మూలంలోనికి ప్రయాణం చేయటం ప్రారంభిస్తుంది. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా నీ మనస్సును తీసుకొని వెళ్ళి ఆధ్యాత్మిక హృదయంలో ఉంచాలి. ఎప్పడైతే నీ మనస్సును ఆధ్యాత్మిక హృదయంలో ఉంచావో అది కాలి బూడిద అవుతుంది. మనం ప్రయత్నం చేసి సాత్విక బుద్ధిని అలవర్చుకోవాలి. సాత్వికబుద్ధిని అలవర్చుకొంటే ధ్యానం దాని అంతట అదే వస్తుంది. అప్పడు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా

ఆనందమే.

ఏయోగం ద్వారా అయినా నీ మనస్సును అంతర్ముఖం చెయ్యి అని శాస్త్రం చెపుతోంది. ప్రాణాయామం నేర్చుకొనే వారు నేర్చుకోండి. నేర్చుకోలేనివారు మీ కంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారిదగ్గర, మహాత్ములదగ్గర, జ్ఞానుల సన్నిధిలో రోజూ ఒక గంట కూర్చొంటే మీకు తెలియకుండా కుంభకం వచ్చేస్తుంది. మీరు ఈ మాటలు నమ్మనక్కరలేదు. చేసి చూడండి మీకే తెలుస్తుంది. భగవంతుని స్మరించండి అని మన పెద్దలు చెపుతూ ఉంటారు. దానివలన మనకులాభం ఏమిటి? భగవంతుని స్మరిస్తూఉంటే, భగవంతుని దైవీగుణాలు మనకు గుర్తుకువస్తూఉంటే మనం పవిత్రులమవుతాము, మనం బాగుపడతాము అందుకు స్మరణ చేయమని పెద్దలు చెప్పారు. భగవంతుని స్మరిస్తే మనం పవిత్రులమవుతామని భగవంతుడే చెపుతున్నాడు ఇంక అనుమానం అనవసరం. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోండి. మనకు జీవితంలో కష్టం ఎదురవుతూ ఉంటుంది సుఖం ఎదురవుతూఉంటుంది. కష్టం కొన్ని పాఠాలు నేర్పుతుంది, సుఖం కొన్ని  పాఠాలు నేర్పుతుంది. కష్టంవచ్చినా, సుఖంవచ్చినా, మంచివచ్చినా, చెడ్డవచ్చినా, గౌరవంవచ్చినా అగౌరవంవచ్చినా  ఎవడైతే తన మనస్సును సమానం చేసుకొంటాడోవాడు యోగి అవుతాడు.

మనం కష్టపడి, సాధనచేసి ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే మనకు అన్నీ లభించినట్లే. అది లేకపోతే ఒకటి లేని సున్నలతో సమానము. ప్రేమలేని, భక్తిలేని పనులు ఎన్ని చేసినా ఒకటిలేని  సున్నలకు ఎంత విలువ ఉంటుందో, వాటికి  కూడా అంతే విలువ ఉంటుంది. కొంతమందికి ప్రతీచిన్నవిషయానికి అనుమానమే. అలా కాకుండా భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే ధృఢవిశ్వాసం ఉంటే నీకు ఎన్ని దురలవాట్లు ఉన్నాకూడా అనుమానాలు పెట్టుకొని సాధనచేసే వారికంటే ముందునువ్వుబాగుపడతావు అని భగవంతుడు చెపుతున్నాడు. నీకు విశ్వాసం ఉంటే కొండలనుకూడా కదపగలవు. విశ్వాసం వలన అంత శక్తి వస్తుంది. నీవు ఎవరో నీకు తెలియనంతకాలం సందేహాలు వస్తూనే ఉంటాయి. అయితే సందేహాలు ఎప్పడు పోతాయి అంటే నువ్వు ఎవరో నీకు తెలిసినప్పడు ఈ సందేహాలు అన్నీ పోతాయి.

మనకు పని చేసిపెట్టేవాడు భగవంతుడు. కాని భగవంతుడు చేయటంలేదు అని మనం అనుకొంటాము. పని చేసేవాడు భగవంతుడు. ఆయన నిశ్శబ్ధంగా చేస్తాడు, గర్వం మనం పొందుతాము. భగవంతుడు చేసేపని మనకళ్ళకు కనబడటంలేదు ఎందుచేతనంటే మనకు కనబడాలని ఆయన అనుకోవటంలేదు. మనగుర్తింపును అయన కోరుకోడు ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకోడు ఎందుచేతనంటే ఆయన దృష్టిలో ఇతరులు లేరు. మనమనస్సు అణిగిఉంటే జ్ఞానంతో, కాంతితో శాంతితో భగవంతుడు మనలను అలంకరిస్తాడు. ఏది తెలుసుకొన్నాక ఇంక తెలుసు  కోవలసినది అంటూ ఏమీ మిగలదో దానిని తెలుసుకో. దానిని తెలుసుకొన్నాక దాని కంటే మించినది కాని, దానితోసమానమైనది కాని ఏదీ లేదు అని నీకే తెలుస్తుంది.